


# ఢిల్లీ దుప్పటి

ఓట్రు ప్రకాశరావు

మృదువుగానున్న ఆ నీలం రంగు దుప్పటిని చేతిలో పట్టుకొని 'ఏదో ఫారిన్ బ్లాంకెట్ లాగుంది. పట్టుకుంటే బొచ్చుకుక్కపిల్లను తాకినట్లుంది. ఈ అంగట్లో వున్న బ్లాంకెట్లలో అన్నిటికన్నా ఇది చాలా బాగుంది. ధర చాలా ఎక్కువగా వుండవచ్చు. ఎంత లేదన్నా ఐదువందల రూపాయల పైనే వుండవచ్చు. దీన్ని కొనగల స్థితి నాకు లేదు' అని మనసులో అనుకున్నాడు ప్రభాకరం.

ధర తెలుసుకోవాలన్న కోరికతో "ధర ఎంత ఉంటుంద న్నయ్యా" రామ్మూర్తి వైపు చూస్తూ అడిగాడు ప్రభాకరం.

రామ్మూర్తి అంగడి అతనితో హిందీలో అడిగి బేరం చేసి చివరగా ప్రభాకరం వైపూ చూస్తూ "రెండు వందలా యాభైవరకు వచ్చాడు. ఇంకాస్సేపు బేరం చేస్తే రెండువందల రూపాయలకు ఇచ్చేలా వున్నాడు.. ఇది నీకు నచ్చిందంటే చెప్పు ప్రభాకరం" అన్నాడు మెల్లగా.

'రెండు వందలా యాభై రూపాయలే చాలా తక్కువ అనుకుంటే, ఇంకా ధర తగ్గిస్తాడా' అని అనుకొంటూ రామ్మూర్తి వైపు చూస్తూ సరేనన్నట్టుగా తల ఆడించాడు.

'రామ్మూర్తి అంగడి అతనితో బేరం చేసి చివరకు నూటయాభై రూపాయలకు కుదిర్చి ప్రభాకరం చెప్పగానే ఆశ్చర్యపోయాడు. ఆనందంతో ప్రభాకరం అంగడి అతనికి నూటయాభైరూపాయలు ఇవ్వగానే ఆ కొత్త ఉన్ని దుప్పటిని ప్లాస్టిక్ కవరునందు వేసిచ్చాడు. ఏదో అపురూపమయిన వస్తువు తీసుకొంటున్నట్లుగా అతి జాగ్రత్తగా తీసుకున్నాడు.

"ఎండాకాలం కాబట్టి ధర తగ్గించాడు. లేకుంటే వాడు చెప్పిన ధరకు పైసాకూడా తగ్గించేవాడు కాదు" అన్నాడు రామ్మూర్తి.

* * *

ప్రభాకరం ఓ చిరు ఉద్యోగి. ఆఫీసు పనిమీద ఢిల్లీకి వెళ్ళవలసి వచ్చింది. ఢిల్లీలో ప్రభాకరంకు పెదనాన్న కొడుకు రామ్మూర్తి ఉండటం వలన హోటల్‌నందు దిగవలసిన అవసరం లేకపోవడం వలన ఆఫీసువారిచ్చే డి.ఎ. డబ్బు చాలావరకు మిగిలింది. రామ్మూర్తి సహాయంతో ఉన్ని దుప్పటి, భార్య విమలకు చీరలు, పిల్లలకు దుస్తులు, ఆటబొమ్మలు కొన్నాడు. ఢిల్లీలో దుస్తులు, ఆట బొమ్మలు చాలా చౌకగా అమ్ముతారని అనుభవపూర్వకంగా తెలుసుకొని ఆశ్చర్యపోయాడు.

ఢిల్లీనుండి భర్త తెచ్చిన దుస్తులు, బొమ్మలు చూసి వాటి ధరలు తెలుసుకొని విమల చాలా ఆనందించింది. అన్నింటికన్నా ఆ కొత్త నీలంరంగు దుప్పటి విమలకు మరీమరీ నచ్చింది. అప్పుడే విమలనందు ఒక ఆలోచన మెదిలింది.

* * *

ప్రభాకరం, విమల దంపతులకు ఇద్దరు సంతానం. కొడుకు శ్రీకర్ తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. కూతురు జనని ఏడవ తరగతి చదువుతోంది.

ఈ ఆధునిక యుగంలో కూడా ఆడపిల్ల పుట్టిందంటే గుండెలమీద కుంపటి అని ఆవేదన పడే తల్లులు వున్నారు. ఆ కోవకు చెందినది విమల.

జనని ఐదవ తరగతికి వెళ్ళినప్పటినుండి చిన్నచిన్న మొత్తాల చీటీలు వేసి ఆ తరువాత వచ్చే డబ్బుతో స్టీలు సామానులు కొని ప్లాస్టిక్

పేపరులో చుట్టి అటకపైన పెట్టి, వాటిని జననికి పెళ్ళయి కొత్తగా కాపురానికి వెళ్ళే సమయాన ఇచ్చి పంపాలని నిర్ణయించుకొంది. జననికోసం అంటూ భద్రపరుస్తున్న స్టీలు సామానులు చూసి ప్రభాకరం నవ్వితే "మీకు తెలీదుకాబట్టి నవ్వుతున్నారు. మీకు అక్కా చెల్లెళ్ళు వుండి వుంటే మీ అమ్మగారుకూడా నాలాగే చేసేవారు. మనం కొత్తగా కాపురం పెట్టినప్పుడు ఇది లేదు అది లేదు అని అనడానికి అవకాశం లేకుండా ఇంటికి కావలసినవన్నీ ఎలా ఇచ్చారో మీకు తెలుసా. నేను పుట్టినప్పటినుండీ మా అమ్మ నా కోసం ఒక్కొక్కటీ కూడబెట్టింది" అంటూ విమల సమాధానం ఇచ్చేది.

ఇప్పుడు తన భర్త ఢిల్లీనుండి తెచ్చిన ఆ నీలంరంగు దుప్పటిని చూడగానే దానినికూడా జనని పెళ్ళయి కాపురానికి వెళ్ళే సమయాన ఇచ్చి పంపాలనుకుంది. భర్తతో చెబితే కోప్పడుతాడని చెప్పలేదు. సమయం వచ్చినప్పుడు చెబుతామను కుంది.

* * *

ఢిల్లీ నుండి తెచ్చిన ఆ కొత్త మృదువైన నీలంరంగు దుప్పటి కప్పుకోవాలన్న కోరిక ప్రభాకరంకు అప్పుడప్పుడూ కలిగేది.

"ఎండాకాలంలో చిన్నపిల్లాడిలా ఏమిటీ పిచ్చికోరిక" అంటూ విమల అడ్డుపడుతుందని తన కోరికను బయటపెట్టలేదు.

చలికాలం ప్రారంభమయింది.

ఒకరోజు రాత్రి "విమలా ఆ ఢిల్లీ దుప్పటి తియ్యవోయ్ చలి ఎక్కువ అయింది" అన్నాడు ప్రభాకరం.

"ఆ దుప్పటి మనం వాడుకొవడానికి కాదండీ" అంది విమల.

"ఏమిటి నువ్వనేది?" అనుమానంగా నొసలు చిట్లించుతూ అడిగాడు.

"చూడండీ, కాలం చూస్తుంటే కళ్ళు మూసుకొని తెరచినంత వేగంగా వెళుతోంది. జనని ఇప్పుడు ఏడవ తరగతి చదువుతోంది. మరో ఏడు, ఎనిమిది సంవత్సరముల లోపున జననికి పెండ్లి చెయ్యవలసి వస్తుంది. పెళ్ళయిన తరువాత జనని కొత్తగా కాపురానికి వెళ్ళేటప్పుడు పుట్టింటివారి పేరు చెప్పుకొనేలా మంచి వస్తువులు ఇచ్చి పంపితేనే బాగుంటుంది. అందుకే మీకు ఢిల్లీ నుండి తెచ్చిన ఆ దుప్పటి జననికి పెళ్ళయ్యాక ఇచ్చి పంపాలనుకున్నాను. మనం కాశ్మీరంలోనో వూటీలోనో వుండటం లేదుగా. మనముంటున్న ఈ రాయలసీమలో చలికి మామూలు దుప్పటి కప్పుకొన్నా వెచ్చగానే వుంటుంది" అంది.

ప్రభాకరం సంతోషం ఒక్కసారిగా చల్లారి పోయింది. "విమలా నీవు బాగా ఆలోచించే మాట్లాడుతున్నావా. స్టీలు పాత్రలతో ఆ అటక పూర్తిగా చోటుచేసుకున్నా నాకు నచ్చకపోయినా పోనీలే అనుకున్నాను. ఎప్పుడో జరగబోయే పెళ్ళికి అంటూ ఇలా...ప్చ్! కాలం వేగంగా వెళ్ళడమేకాదు దానితోపాటు ఎన్నో కొత్త మార్పులు కూడా వస్తాయి. అప్పటికి ఇవన్నీ మామూలు వస్తువులుగా కనపడవచ్చు" అన్నాడు.

"మీరెన్నయినా చెప్పండి. నేను మాత్రం ఆ ఢిల్లీ దుప్పటి వాడటానికి అంగీకరించను" ఖచ్చితంగా చెప్పింది విమల.

తాకితే కుక్కబొచ్చులా, మృదువుగా వున్న ఆ నీలంరంగు దుప్పటి కప్పుకొని చలికాలం సుఖంగా వెచ్చదనంతో నిదురపోవాలన్న అతిచిన్న కోరికకు అడ్డుపడిన విమలపై కోపం కలిగింది.

తనంతకు తాను బీరువా తెరచి ఆ దుప్పటి తీసి వాడుకోవాలన్న మొండితనం రాలేదు కానీ, విమల చేతులతో ఆ దుప్పటి తీయించి వాడండి అని చెప్పించాలన్న పట్టుదల ప్రభాకరంలో కలిగింది. దుప్పటి విషయంలో భార్యను అప్పుడప్పుడూ కోప్పడసాగాడు.

తన భర్త ఆడంబరంగా ఉండాలనుకొనే వ్యక్తి కాదని విమలకు తెలుసు. ప్రైవేటు సంస్థలో గుమాస్తా పనిచేస్తూ భర్త తెచ్చే ఆ చిన్న జీతంతో మందులు.. పిల్లల పోషణా... చదువులు.. ఇంకా.. ఎన్నో ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఈ దుప్పటి చూడటానికి అపురూపంగా ఉండటంతో జననికి ఇవ్వడానికి నిర్ణయించుకొంది. అందుకే దుప్పటి విషయంలో పట్టుదలగా వుంటూ భర్త పెదవి విరుపులకు అలవాటుపడసాగింది. ఇప్పుడు కాకపోయినా జనని కొత్త కాపురం పెట్టిన తరువాత తన భర్త తప్పకుండా మెచ్చుకొంటాడన్న నమ్మకం విమల మనసులో ఏర్పడింది.

* * *

జనవరి నెలలో ఒకరోజు సాయంత్రం ప్రభాకరం ఆఫీసు నుండి ఇంటికెళ్ళాడు. ఇంట్లో అత్తమామలు ఉండటం చూసి పలుకరించాడు. వారు అంతకుమునుపే ఊరినుండి వచ్చారని తెలుసుకున్నాడు. వారిని చూశాక ప్రభాకరంకు లోలోన చాలా సంతోషం కలిగింది. ఎందుకంటే ఇంట్లోవున్న మూడు దుప్పట్లు బాగా మాసిపోయాయని ఉదయమే చాకలికి వేసింది. ఇంట్లో రాత్రి కప్పుకొనడానికి ఒకే ఒక్క దుప్పటి వుంది. 'ఎలాగైనా ఈ రాత్రి కొత్త దుప్పటి వాడక తప్పదు' మనసులో సంతోషముతో అనుకున్నాడు. అంతలోనే విమల ఆ కొత్త దుప్పటిని ఎవరికిస్తుందోనన్న అనుమానం కలిగింది. ఎవరికిస్తేనేం ఈవేళ కాకుంటే రేపయినా వాడుకోవచ్చు. ఒకసారి వాడుకొన డానికి బయటికి తీస్తే చాలు' అని లోలోన సంబరపడ్డాడు.

ఆ రాత్రి భోజనాల సమయాన మాటల సందర్భమున "మన ఊరికన్నా ఇక్కడ చలి చాలా ఎక్కువగా ఉంది" అన్నాడు విమల తండ్రి.

భోజనాలు పూర్తయ్యాక బెడ్‌రూమునందున్న మంచం, పరుపు తీసుకొని వచ్చి హాలులో వేసి, పరుపు పైనున్న పలుచటి దుప్పటిని తీసి ఇస్తూ "నాన్నా, మీరు శ్రీకర్ మంచంపై పడుకొని దీన్ని కప్పుకోండి" అంది విమల.

మంచం ప్రక్కనే చాప పరచి ఇంట్లో వున్న దుప్పటి తల్లికిస్తూ "అమ్మా, మీరు జనని ఈ దుప్పటి కప్పుకొని పడుకోండి" అంది.

ప్రభాకరం బెడ్‌రూములోనికి వెళ్ళాడు. నేలమీద చిరిగిన పాత చీరను పరచి వుండటం గమనించాడు. అంతలో విమల లోనికి వచ్చి తలుపు గడియపెట్టింది.


"కప్పుకొనడానికి దుప్పటి ఎక్కడ' మెల్లగా అడిగాడు.


"నేనున్నాను కదండీ" మెల్లగా చిరునవ్వుతో.

కొత్త దుప్పటి తీయడం లేదని తెలుసుకొనగానే విమలపై విపరీతమైన కోపం కలిగింది.

విమల మెల్లగా భర్తపై చేయి వేసింది. ప్రభాకరం భార్య చేతిని విసిరికొట్టి తల అటువైపుకు తిప్పుకొని దూరంగా జరిగాడు.

ప్రతిరోజూ మంచంపై దుప్పటి కప్పుకొని పడుకొనే ప్రభాకరంకు నేలమీదున్న ఆ చిరిగిన చీరపై పడుకోవడంవల్ల చలికి శరీరం మెల్లగా వణకసాగింది. అతనిలో ఏర్పడిన కోపంవల్ల అంత చలిలోనూ పక్కనున్న భార్యను తాకకుండా





మోకాళ్ళు ముడుచుకొని చేతులు రెండూ మోకాళ్ళ మధ్యన పెట్టుకొని నిదుర రాకున్ననూ రాత్రంతా అటూ ఇటూ పొర్లసాగాడు.

* * *

విమల అప్పుడప్పుడూ ఆ కొత్త దుప్పటి తీసి కలరా వుండలు, వేసి జాగ్రత్త చేస్తోంది. చలికాలం వస్తూ వుంది. పోతూ వుంది. ప్రభాకరం కోరిక నెరవేరలేదు.

చలికాలం వచ్చినప్పుడంతా 'కొత్త దుప్పటి వుండి కూడా కాస్త సుఖంగా వెచ్చగా నిద్రపోవ డానికి కూడా ఈ కొంపలో అవకాశం లేదు' అంటూ గొణుగుతూ, సూటిపోటి మాటలతో భార్యను సాధించసాగాడు. విమల భర్త మాటలను తేలికగా తీసుకుంది.

మొత్తంమీద ఆ ఇంటికి ఆ ఢిల్లీ దుప్పటి వచ్చి ఐదు సంవత్సరములు గడిచింది.

* * *

ఒకరోజు ఆఫీసులో పనిచేస్తున్న ప్రభాకరంకు గుండెనొప్పి వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొని వెళ్ళారు.

డాక్టరు ముఖంలో కనపడుతున్న ఆందోళన, నర్సుల హడావిడి చూసి తనకు వచ్చిన నొప్పి ప్రమాదకరమైనదిగా ఊహించాడు.

ఇంజక్షన్, మాత్రలుతీసుకొన్న తరువాత ప్రభాకరం మెల్లగా నిదురపోసాగాడు. రెండు గంటల తరువాత మేలుకొన్న ప్రభాకరంకు కాస్త తగ్గినట్లనిపించింది. ఆ సమయంలో తను బ్రతకనేమోనన్న అనుమానం కలిగింది. తను చనిపోతేభార్య, పిల్లలు ఎలా.. ఎలా .. బ్రతుకుతారు అన్న ఆలోచన. తన తరువాత వచ్చే డబ్బును ఫిక్సెడ్‌లో వేసి నెలనెలా వచ్చే తక్కువ వడ్డీ డబ్బుతో గడపవలసి ఉంటుంది. డబ్బు తక్కువగా ఉన్నా కుటుంబాన్ని ఉన్నంతలో నడపగల నైపుణ్యం విమలలో వుంది. ఆలోచి స్తూంటే జనని భవిష్యత్తు విషయంలోవిమల చేసింది సరి అయినదిగా కనపడుతోంది. దీప ముండగానే ఇల్లు చక్కదిద్దుకొనే విమలను అనవసరంగా అపార్థం చేసుకున్నాను. ఎన్నోసార్లు కొత్త దుప్పటి కోసం విమలను బాధపెట్టాను. ఈ రోజు ఉదయ మంతా ఆ కొత్త దుప్పటి వాడలేదని సూటిపోటి మాటలతో విమల మనసును గాయపరిచాను. మధ్యతరగతి వాడినై వుండి కూడా ఓ ఆడపిల్ల తండ్రిగా ప్రవర్తించక చిన్న పిల్లాడిలా ప్రవర్తించి విమలను బాధపెట్టాను. ముందు విమలకు క్షమా పణలు చెప్పుకోవాలి' అనుకుంటుండగానే మరలా గుండెనొప్పి ఎక్కువకాగానే దగ్గర కొచ్చిన నర్సుతో నొప్పి ఎక్కువౌతున్నట్లు సైగచేస్తూ మెల్లగా చెప్పాడు. డాక్టరు వచ్చి పరీక్ష చెయ్య సాగాడు.

ప్రక్కనే నిలబడివున్న విమలను చూస్తూ "విమలా.." అన్నాడు. కన్నీళ్ళు తుడుచు కుంటూ ఏడుపు దిగమింగుకుని "ఏమండీ" అంది.

"ఆ.. ఢిల్లీ దుప్పటి.." అంటూ చెప్పబోతుంటే విపరీతంగా గుండెనొప్పి రావడంతో ఆ తరువాత తాను చెప్పదలచుకొన్నది చెప్పలేక బాధగా కళ్ళు మూసుకున్నాడు. డాక్టర్లు ఎంత ప్రయత్నించినా ప్రభాకరం ప్రాణాలను కాపాడలేక పోయారు.

భర్త చివరగా "ఢిల్లీ.. దుప్పటి" అంటూ మధ్యలోనే నిలిపివేయడంతో 'ఆ ఢిల్లీ దుప్పటి చివరి వరకు వాడకుండానే పోతున్నాను విమలా' అంటూ చెప్పాలనుకొన్నారు అని అనుకొంది విమల. విమల మనసులో "ఢిల్లీ.. దుప్పటి" అని చివరగా అన్న మాటలు ముల్లుగా గుచ్చుకో సాగింది.

* * *

శవాన్ని ఇంటిలో పరుండబెట్టారు. బంధువు లందరూ వచ్చాక శవాన్ని తీసుకొని వెళ్ళడానికి కావలసిన ఏర్పాట్లు చేశారు.

"శవంపై కప్పడానికి కొత్త పంచె ఇంట్లో వుందా" ఎవరో మెల్లగా విమలను అడిగారు.

విమలకు ఆ సమయాన ఢిల్లీ నుండి తెచ్చిన ఆ కొత్త దుప్పటి జ్ఞాపకం వచ్చింది. 'నేను ఇంతవరకు మధ్యతరగతికి చెందిన ఆడపిల్ల తల్లిగా ప్రవర్తిస్తూ తన కుటుంబం కోసం కష్టపడే భర్త చిరు కోరికను అర్థం చేసుకోలేకపోయాను. కనీసం ఇప్పుడయినా ఆ దుప్పటి వాడకపోతే ఆయనకు ద్రోహం చేసినదాన్నవుతాను. అంతే కాదు, ఆయన ఆత్మకు శాంతికూడా లేకుండా చేసినదాన్నవుతాను' అని అనుకొంటూ లేచి బీరువాలో ఉన్న కొత్త దుప్పటిని తీసుకొని వచ్చింది.

ఆచారం ప్రకారం చనిపోయినప్పుడు ఉపయోగించిన దుస్తులు, శవంపై కప్పిన గుడ్డను శ్మశానం దగ్గరే వదిలివేస్తారు. వాటిని ఇంటికి తీసుకొని రారు. అన్న సంగతి విమలకు తెలుసు. ఆ దుప్పటి శవంపై కప్పితే తిరిగి ఇంటికి రాదన్న సంగతి విమలకు తెలిసిననూ భర్త ఆత్మశాంతి కోసం ఇంతకాలం అపురూపంగా, అతి భద్రంగా దాచిన ఆ మృదువైన నీలంరంగు ఢిల్లీ దుప్పటిని భర్త శవంపై కప్పింది. *

## ముద్దుకి అభ్యంతరమెందుకు?

*'ము...ము...ముద్దంటే చేదా? నీకా ఉద్దేశం లేదా?' అంటూ తన ప్రియుడి గురించి ఏనాడో పాడింది ఓ నటి. అయితే తనకూ ఎలాంటి అభ్యంతరం లేదని చెబుతోంది వింధ్య. సినిమాల్లో ముద్దు సీన్లలో నటించడానికి తనకెలాంటి అభ్యంతరమూ లేదట. తమిళంలో రెచ్చిపోయి నటిస్తూ మంచి అవకాశాలు సంపాదిస్తున్న ఈ ముద్దు గుమ్మ 'మరి స్విమ్ సూట్‌లో కూడా నటిస్తావా?' అనడిగితే "ఇంత వరకూ అలాంటి అవకాశం రాలేదు. స్విమ్ సూట్ నటించడానికి అభ్యంతరమెందుకు?" అంటూ ఎదురు ప్రశ్నించింది ఈ తెలుగు భామ. వింటున్నారా నిర్మాతలూ.*